సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 21 । జూన్ । 2024



సోమశిలలో 9.77 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 9.772 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 4908 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,651
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,850
సవర (8 గ్రాములు)	రూ.54,800



పేదల బతుకులు బుగ్గి

నెల్లూరులోని బర్మాషెల్‌గుంటలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనలో దివ్యాంగురాలు మృతి చెందగా.. 12 పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

23 వేల భూసార పరీక్షలు లక్ష్యం



మాట్లాడుతున్న కన్నయ్య

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఈ ఏడాది 23,300 భూసార పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని జిల్లా భూసార పరీక్ష కేంద్ర అధికారి కన్నయ్య పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. పొలంలోని మట్టిని తీసుకొస్తే 12 రకాల పరీక్షలను నిర్వహించనున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల నుంచి మట్టిని సేకరించి జిల్లా కార్యాలయానికి పంపితే పరీక్షలు చేయనున్నామని చెప్పారు. ఈ ప్రక్రియకు రైతులు సహకరించాలని కోరారు.

బడి బయట పిల్లలను గుర్తించండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముత్తుకూరు: బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉషారాణి కోరారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని వివరించారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. తొలుత ర్యాలీని నిర్వహించారు. ఎంఈఓలు మధుసూదన, హేమసుందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బంది, ఉద్యోగులతో భగేష్ మిశ్రా

నెల్లూరు(సెంట్రల్): మూగజీవాలను ఆదుకునే విషయంలో 1962 వాహన ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సంస్థ ప్రాజెక్ట్ స్టేట్ హెడ్ భగేష్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని పశుసంచార అంబులెన్స్‌ను గురువారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో పాడి పశువులకు అనారోగ్యాలు వస్తుంటాయని, వీటిని కాపాడి రైతులకు అండగా నిలవాలని సూచించారు.

ఇంటర్వ్యూలకు పది మంది హాజరు

జిల్లాలోని 1962 అంబులెన్స్‌లకు సంబంధించి గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు పది మంది హాజరయ్యారని భగేష్ మిశ్రా పేర్కొన్నారు. అర్హుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఫ్లీట్ హెడ్ ఫణీంద్ర, ప్రోగ్రామ్ మేనేజర్ రామలింగేశ్వరరెడ్డి, జిల్లా మేనేజర్ నెమలి శివశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే



నెల్లూరు(దర్గామిట్ట): నగరంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఏపీఆర్‌ఎస్‌ఏ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జూన్ 20వ తేదీని రెవెన్యూ దినోత్సవంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓను జారీ చేసిన నేపథ్యంలో నెల్లూరుతో పాటు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని జరిపారు. కలెక్టరేట్లోని ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్వో లవన్నను సత్కరించారు. రెవెన్యూ పతాకాన్ని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి ఎగురవేశారు. జిల్లా కార్యదర్శి డేనియల్ పీటర్, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, అనిల్‌కుమార్‌యాదవ్, సతీష్, జమీర్‌బాషా, సుప్రియ, శరణ్య పాల్గొన్నారు.

'విక్రమ సింహపురి'కి అదనపు కోచ్‌లు

నెల్లూరు(సెంట్రల్): విక్రమ సింహపురి అమరావతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు మూడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ – గూడూరు (12744) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 20 నుంచి 30 వరకు.. గూడూరు – విజయవాడ (12743) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి జూలై ఒకటి వరకు ఈ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇవి సెకండ్ సిట్టింగ్‌కు సంబంధించినవన్నారు.

దుర్గం.. పర్యాటక శోభితం


ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రకృతి శోయగాలు.. కనువిందు చేసే జలపాతాలు.. శిల్పకళకు అద్దంపట్టే దేవాలయాలు.. సుందరమైన పర్వత శ్రేణులు.. అడుగడుగునా కనిపించే అలనాటి మందిరాలు.. ఇలా ఒక్కటేమిటి ఎన్నెన్నో విశిష్టతలతో నిండిన ప్రాంతాలు సిద్ధేశ్వరం, దుర్గంపల్లి. వీటిని ఎకో టూరిజం స్పాట్లుగా తీర్చిదిద్దేందుకు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను గతంలో ప్రభుత్వానికి పంపారు. వణ్యప్రాణులకు హాని తలెత్తకుండా, పర్యాటకులకు భద్రత కల్పిస్తూ అటవీ శాఖ ప్రణాళికలను రూపొందించింది. ఇవి కార్యరూపం దాల్చాల్సిన అవసరం ఉంది.



దుర్గంపై ఉన్న పెద్ద మసీదు

- గత ప్రభుత్వ హయాంలో రూ.5.56 కోట్లతో వసతుల కల్పనకు ప్రతిపాదనలు
- రోప్‌వే నిర్మాణానికి పరిశీలన



ఉదయగిరి దుర్గం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఉదయగిరి దుర్గానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. చోళులు, పల్లవులు, రెడ్డి రాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు, రాయలు ఈ ప్రాంతాన్ని ఏలారు. రెండు శతాబ్దాలకు పూర్వం వరకు మహోన్నతంగా ఓ వెలుగు వెలిగిన ఉదయగిరి ప్రాంతం ఆనాటి వైభవాన్ని పూర్తిగా కోల్పోయింది. అప్పటి రాచరిక పాలనకు గుర్తుగా కనిపించే మొండి గోడలు, శిథిల రాజభవనాలు దర్శనమిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో.. నీటి ఆధారం లేని మెట్ట ప్రాంతంగా ఉదయగిరి అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే శోభను సంతరించుకోనుంది.

తొలి సూర్యకిరణాలు పడే గిరి.. ఉదయగిరి

సముద్ర మట్టానికి 755 అడుగుల ఎత్తులో ఉదయగిరి కోట ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రత 20 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఇది ఐదు కిలోమీటర్ల వ్యాసార్థంతో తిరుమల కొండను పోలి ఉంది. పచ్చటి బయళ్లతో వన్యప్రాణులతో ప్రకృతి సౌందర్యాన్ని సంతరించుకుంది. ఈ ప్రాంతంలో ఉదయించే సూర్యుడి తొలి కిరణాలు కొండ (గిరి)పైనే పడతాయి. విజయనగర సామ్రాజ్యంలో సూర్యకిరణాలు ఒక్క కొండ కోటపైనే ముందుగా పడుతుండటంతో దీనికి ఉదయగిరిగా నామకరణం చేశారనేది నానుడి. ఇంతటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఉదయగిరి దుర్గంపై కృష్ణదేవరాయలు 18 నెలలు మకాం వేసి పాలన సాగించారని చరిత్రకారులు చెప్తున్నారు.

చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి

విజయనగర గజపతులు ఉదయగిరి ప్రాంతంలో దేవాలయాలు, కోనేర్లను నిర్మించారు. కృష్ణదేవరాయలు నిర్మించిన ఆలయాలు.. నవాబులు నిర్మించిన మసీదులు, రాణీ మందిరాలు, ధాన్యాగారాలు, గుర్రపు శాలలు, ఫిరంగి కోటలు, సొరంగ మార్గం నేటికీ ఉన్నాయి. ఉదయగిరి దుర్గం కింద పట్టణంలో రంగనాథస్వామి ఆలయం, కృష్ణాలయం, కల్యాణ మండపం చూపరులను ఆకర్షిస్తున్నాయి. కృష్ణదేవరాయలు తన పాలనకు గుర్తుగా ఉదయగిరి ట్యాంక్‌బండ్ సమీపంలో నిర్మించిన కోనేరు అలనాటి శిల్పకళా వైభవాన్ని చాటి చెప్తోంది. ఉదయగిరి అడవులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కోనేర్ల ఆనవాళ్లు కనిపిస్తాయి. ఉదయగిరి నుంచి బండకిందపల్లికి వెళ్లే ఘాట్‌రోడ్డు మార్గంలో తవ్విన బావి తానాబావిగా ప్రసిద్ధి చెందింది. ఈ బావిలోని నీరు వన్యప్రాణులకు ఎంతో ఉపయోగపడుతోంది. అనంతరం బ్రిటిష్ హయాంలో స్టేట్ దొర నిర్మించిన ప్రార్థన మందిరం, తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇలా చెప్పుకొంటూ పోతే ఉదయగిరి ప్రాంతంలో అనేక ప్రదేశాలు పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.



పురాతన కోనేరు

చూడదగిన ప్రదేశాలు

ఉదయగిరికి 33 కిలోమీటర్ల దూరంలో అత్యంత ప్రాచీనమైన ఘటిక సిద్ధేశ్వరంలో శైవక్షేత్రం ఉంది. ప్రాచీన శైవక్షేత్రం, ఆలయ పరిసర ప్రాంతాలు ప్రకృతి రమణీయతతో చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి. సిద్ధేశ్వరానికి అతి సమీపంలో ఉన్న బూసానాయుడు కోటను అభివృద్ధి చేయొచ్చు. ఇక్కడి నుంచి 30 కిలోమీటర్ల మేర ప్రకృతి సోయగాల నడుమ పయనిస్తూ ముందుకెళ్తే అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో ఒకే రాతిపై పల్లవులు నిర్మించిన దేవాలయం, ద్వారపాలకులు, శివలింగాల నందీశ్వరుడు కొలువైన భైరవకోన ఉంది. ఇక్కడ ఏడాది పొడవునా జాలువారే జలపాతాలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తాయి. అక్కడి నుంచి మరో 24 కిలోమీటర్ల దూరంలో నారాయణ స్వామి ఆలయం.. పది కిలోమీటర్ల దూరంలో హనుముని కొండ ఉంది. అక్కడి నుంచి 25 కిలోమీటర్లు ముందుకెళ్తే వెంగమాంబ ఆలయాన్ని సందర్శించొచ్చు.



రంగనాథస్వామి ఆలయం


నెరవేరని హామీ

అప్పటి ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్యనాయుడు వ్యవహరించిన సమయంలో నాటి పర్యాటక మంత్రి అనంత్‌కుమార్, కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌ను ఉదయగిరికి ఆహ్వానించి హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. అప్పట్లో ఉదయగిరి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని భావించారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినా, అది కార్యరూపం దాల్చలేదు. సీఎం కార్యాలయంలో ప్రస్తుతం కీలకంగా ఉన్న ముద్దాడ రవిచంద్ర కలెక్టర్‌గా ఉన్న సమయంలో దుర్గాన్ని సందర్శించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయినా నేటికీ ఎలాంటి ప్రయోజనం లేదు.

అభివృద్ధికి ప్రణాళికలు

పర్వతశ్రేణులు.. ప్రకృతి రమణీయతను పుణికి పుచ్చుకున్న ఉదయగిరి ప్రాంతాన్ని ఒక్కసారి వీక్షిస్తే.. మరిచిపోలేని మధురానుభూతులు మదిలో నిలిచిపోతాయి. సిద్ధేశ్వరం, దుర్గంపల్లిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు అటవీ శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. పార్కులు.. తాగునీటి వసతులు.. రిఫ్రెష్ అయ్యేందుకు గదులు.. గార్డెన్లు.. వాచ్ టవర్లు, సోలార్ షెడ్.. లైట్లు ఇలా.. 45 రకాలు పనులకు రూ.5.56 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇవి ఆమోదం పొందితే ఉదయగిరి పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంది.

చిగురిస్తున్న ఆశలు



సోమశిల జలాశయం

- సోమశిలకు నీటి ప్రవాహం
- 12 రోజుల్లో పెరిగిన రెండు టీఎంసీలు

తేదీ	నమోదైన ఇన్‌ఫ్లో
జూన్ 9	2966
10	3753
11	2456
12	4072
13	2094
14	1850
15	1676
16	1607
17	1320
18	891
19	4433
20	4908

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా జలనిధి సోమశిల జలాశయానికి వారం రోజులుగా వస్తున్న వరద ప్రవాహంతో ఆశలు చిగురిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఖరీఫ్ సమయానికి 75 టీఎంసీలకు తగ్గకుండా ఉన్న జలాశయం ఈ ఏడాది డెడ్ స్టోరేజీకు చేరుకుంది. 12 రోజుల క్రితం వరకు 7.293 టీఎంసీలు నిల్వ ఉండటంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో నైరుతి రుతుపవనాల రాకతో చెదురుమదురుగా వర్షాలు పడుతుండటం, ఎగువ ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఇక్కడికి ఇన్‌ఫ్లో పెరిగింది. తొలుత ఈ నెల 8న 521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. అనంతరం వర్షాల్లేకపోవడంతో ఇన్‌ఫ్లో వచ్చే అవకాశాల్లేవని డీలాపడ్డారు. అయితే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో నిత్యం కొనసాగుతూ వచ్చింది. శ్రీశైలం నుంచి సైతం ఇన్‌ఫ్లో ప్రారంభమైతే జలాశయంలో రైతులు ఆశించిన మేర నీటి నిల్వ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా సరుకుల పంపిణీ

- జేసీ సేతు మాధవన్



నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా జిల్లాలోని బియ్యం కార్డుదారులకు నిత్యావసర సరుకులను పక్కాగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని జేసీ సేతు మాధవన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పును జూలై నుంచి అందజేయనున్నామని చెప్పారు. దీనికి అవసరమైన సరుకులు జిల్లాకు వచ్చాయని, కొలతలను సంబంధిత ఆర్డీఓ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల ద్వారా ర్యాండమ్‌గా పరిశీలించనున్నామని పేర్కొన్నారు. కార్డుకు అర కిలో చక్కెర, కిలో కందిపప్పును అందజేయనున్నామని, ప్రస్తుతానికి మొబైల్ వాహనాల ద్వారా ఇళ్ల వద్దే పంపిణీ చేస్తామన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసిన అడవి పేరంటాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఎడ్ల బండలాగుడు పోటీలను గురువారం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలా సూరారెడ్డి ఎడ్లు 1545.5 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా గోపవరం మండలం వల్లావారిపల్లికి చెందిన బండి భార్గవ్ ఎడ్లు 1,250 అడుగుల దూరం బండ లాగి ద్వితీయస్థానంలో నిలిచాయి. అదే జిల్లా చెన్నూరు మండలం ఓబులంపల్లికి చెందిన పానపురెడ్డి సతీష్‌రెడ్డి ఎడ్లు 820.5 అడుగులు బండలాగి తృతీయస్థానంలో నిలిచాయి. వీరికి బహుమతులను ఆలయ కమిటీ అందజేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు.

క్షయ రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు(అర్బన్): క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర టీబీ నివారణాధికారి, జాయింట్ డైరెక్టర్ రమేష్ పేర్కొన్నారు. వయోజనులకు జిల్లాలో నిర్వహిస్తున్న టీబీ వ్యాక్సినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించే నిమిత్తం నగరానికి గురువారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యతో కలిసి జిల్లాలో జరుగుతున్న టీబీ వ్యాక్సినేషన్‌పై చర్చించారు. అనంతరం దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో గల ఏఆర్టీ సెంటర్‌ను సందర్శించి.. అక్కడ చికిత్స పొందుతున్న హెచ్ఐవీ, టీబీ రోగులను పరిశీలించారు. గూడూరు మండలంలోని మాచవరం, మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న సచివాలయాలను సందర్శించి అక్కడ వయోజనులకు వేస్తున్న టీబీ టీకాపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2027 నాటికి టీబీని పారదోలేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, ఏపీ శాక్స్ డిప్యూటీ డైరెక్టర్ చక్రవర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23న పురుషుల హాకీ జట్టు ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీనియర్స్ జిల్లా పురుషుల హాకీ జట్టును నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి హాకీ క్రీడా మైదానంలో ఈ నెల 23న ఎంపిక చేయనున్నామని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో ఆ రోజు సాయంత్రం మూడు గంటలకు హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ధర్మవరంలో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు రూరల్: పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ప్రహరీ పనులను సత్వరమే పూర్తి చేయడంతో పాటు గదులకు సీలింగ్, పెయింటింగ్‌తో పాటు ఇతర పనులను పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహ భవనంతో పాటు నూతనంగా నిర్మించిన ఆర్డీఓ కార్యాలయ భవనాలను గురువారం ఆయన పరిశీలించారు. భవన ఆవరణలోని చెత్తాచెదారాలను తొలగించాలని, అతిథిగృహానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆత్మకూరు ఆర్డీఓ మధులత, ఆర్ అండ్ బీ ఈఈ మురళీకృష్ణ, డీఈ మదన్‌కుమార్, ఏఈ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరి మృతి



లారీ కిందికి దూసుకెళ్లిన బైక్

కావలి: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరుపాడు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరులోని అక్కిరెడ్డిపాళేనికి చెందిన నేలకూరు పరమేశ్వరరావు (38) బేల్దారిగా పనిచేస్తున్నారు. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో నివాసం ఉంటున్న తన తల్లి, సోదరిని చూసేందుకు బైక్‌పై వచ్చారు. తిరిగి గుంటూరు బయల్దేరారు. ఈ క్రమంలో మద్దూరుపాడు వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొన్నారు. ప్రమాద తీవ్రతకు లారీ కింద బైక్ ఇరుక్కుపోయింది. దీంతో బైక్ నడుపుతున్న పరమేశ్వరరావు, వెనుక కూర్చొని ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా నెల్లూరు నుంచి పరమేశ్వరరావు ఒక్కరే బయల్దేరారని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి ఎవరనేది తెలియడం లేదు. మార్గమధ్యలో ఎవరైనా లిఫ్ట్ అడిగి ఎక్కి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



కందుకూరు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఓగూరు సమీపంలో గల కోల్డ్ స్టోరేజ్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల వివరాల మేరకు.. ఓగూరుకు చెందిన ఏపూరి మాలకొండయ్య (65) తన టీవీఎస్‌పై సింగరాయకొండ వైపు బయల్దేరారు. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఓ ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపి ఉంచారు. ఈ క్రమంలో గమనించకపోవడంతో దాన్ని మాలకొండయ్య ఢీకొన్నారు. దీంతో రోడ్డుపై పడి తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుదలతో విజయతీరాలకు..

- ఆరోగ్యం కోసం యోగా సాధన
- పోటీల్లో రాణిస్తున్న నెల్లూరు మహిళ
- ఎన్నో అవార్డులు అందుకున్న వైనం



యోగా సాధన చేస్తున్న అరుణకుమారి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆమెకు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో యోగాను ఆశ్రయించింది. పట్టుదలతో సాధన చేసింది. ఇప్పుడు ఏకంగా పోటీల్లో రాణిస్తోంది. గురువుగా మారి అనేకమందికి నేర్పిస్తోంది. ఆమే నెల్లూరు నగరంలోని టెక్కేమిట్టలో నివాసం ఉంటున్న అరుణకుమారి. భర్త సుబ్రహ్మణ్యం ఎంపీడీఓగా పనిచేస్తున్నారు. కుమార్తె భవజ్ఞ ఇంటర్మీడియట్ చదువుతోంది. అరుణ తన కుమార్తెకు జన్మనిచ్చిన తర్వాత మైగ్రేన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంది. డాక్టర్ల వద్ద చూపించుకుని ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ సమయంలో ఓ స్నేహితురాలి సలహాతో శ్రీనివాసులు అనే గురువు వద్ద కొంతకాలం శిక్షణ తీసుకుంది. ఆమెకు యోగాపై మక్కువ పెరిగింది. భర్త ప్రోత్సాహంతో బెంగళూరులో యోగాలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసింది. ఆరోగ్యం కోసం యోగా సాధన మొదలు పెట్టగా కాలక్రమంలో పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగింది. దీంతో ఎన్నో అవార్డులు వరించాయి. అరుణ తాను నేర్చుకున్న యోగాను పలువురికి అందించాలని శిక్షణ ఇవ్వడం కూడా ప్రారంభించింది. ఇటు పోటీల్లో పాల్గొంటూనే మరోవైపు శిక్షణ ఇస్తోంది. పూర్వీకులు మనకందించిన యోగాను సమాజహితం కోసం ప్రజలకు చేరువ చేయాలనే ఆమె లక్ష్యం ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

అవార్డులు

- ➡ 2022లో కావలిలో జరిగిన అంతర్ జిల్లాల యోగా చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానం.
- ➡ 2022, 2024లో కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రెండో స్థానం.
- ➡ 2023లో తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానం.
- ➡ 2021, 2022లో బెస్ట్ యోగా టీచర్ అవార్డు.
- ➡ 2023, 2024 రిపబ్లిక్‌డే అవార్డు.
- ➡ 2023 జనవరి 26న ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా రిపబ్లిక్‌డే అవార్డు.
- ➡ 2022లో అండమాన్ నికోబార్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ స్థానం.
- ➡ 2024లో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ స్థానం.
- ➡ ఈ ఏడాది తమిళనాడు యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ బెస్ట్ యోగా టీచర్ అవార్డును ప్రకటించింది.

విలువైన సంపద

మానసిక, శారీరక పరిపూర్ణతను సాధించేందుకు యోగా అద్భుతమైన ప్రక్రియ. మన పూర్వీకులు అందించిన విలువైన సంపద ఇది. పిల్లల్లో యోగాపై ఎంతో శ్రద్ధ ఉంది. పోటీల్లో బహుమతులు రాకపోతే తల్లిదండ్రులు వారిని సాధనకు పంపడం మాన్పించేస్తున్నారు. యోగా ఒక జీవన విధానమని అందరూ గుర్తించాలి. జీవితంలో ప్రశాంతతను సంపాదించాలంటే యోగాను మించిన సాధన మరేది లేదు.

– అరుణకుమారి, యోగా గురువు

యోగాతో ఆరోగ్యం



యోగా.. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రస్తుతం అనేకమంది ఆసనాలు వేయడాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకున్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. యోగా ఎంతో ప్రాచీనమైంది.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

శుక్రవారం ఇంటర్నేషనల్ యోగా డే. ఈ సందర్భంగా జిల్లాలో పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాలు, క్యాంపులు, సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





నెల్లూరులో స్కూల్ విద్యార్థుల యోగాసనాలు



సర్వం కోల్పోయి నిస్సహాయులుగా..



ఎగసిపడుతున్న మంటలు



కాలి బూడిదైన ఇళ్లు

- అగ్నిప్రమాదంతో వీధిన పడిన కుటుంబాలు
- కన్నీటిపర్యంతమైన బాధితులు
- రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం
- పరిశీలించిన అధికారులు, పోలీసులు





గాయపడిన జయమ్మ, చంద్ర



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): వారంతా నిరుపేదలు. కూలి పని చేసుకుని ఉన్న దాంట్లోనే అవసరాలను తీర్చుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. గురువారం ఎప్పటిలాగే పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. భోజనం చేసి నిద్రలోకి జారుకున్నారు. కాసేపటికి ఇళ్లంతా దట్టమైన పొగ వ్యాపించడాన్ని చూసి భయంతో బయటకు పరుగులు తీశారు. అప్పటికే మంటల్లో ఇళ్లు చిక్కుకుపోయాయి. మంటలను ఆర్పేందుకు యత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. కొందరు వృద్ధులు ఇళ్లలోనే ఉండడంతో వారిని ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న ఓ దివ్యాంగురాలు కనిపించకపోవడంతో ఆమె కోసం వెతుకులాడసాగారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే క్రమంలో ఓ గుడిసెలో ఆమె పూర్తిగా కాలిపోయి ఉండడాన్ని చూసి అందరూ కన్నీటి పర్యంతమయ్యారు. అగ్నిప్రమాదం రూపంలో పలు కుటుంబాల్లో ఆనందం ఆవిరైపోయింది. ఉండేందుకు గూడు కట్టుకునేందుకు బట్టలతోపాటు సర్వం అగ్నికి దగ్ధమవడంతో వారు కట్టుబట్టలతో వీధినపడ్డారు. ఈ హృదయ విషాదకర ఘటన రంగనాయకులపేట రైల్వేగేటు సమీపంలోని బర్మాషెల్‌గుంటలో గురువారం జరిగింది.

నాలుగేళ్ల క్రితం

పాత చెక్‌పోస్టు ప్రాంతంలో నందిని, శ్యాంసుందర్‌రావు, మునాఫ్, అన్సారి, దీవెన, మనోహరమ్మ, సంధ్య, కమల, వసంత, వసంతమ్మ, జ్యోతి, జయమ్మ, నాగలక్ష్మి (40), పోతురాజు, బంగారమ్మ తదితరులు నివాసం ఉండేవారు. రైల్వే లైన్ విస్తరణ పనుల నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం అక్కడి నుంచి వారు ఖాళీ చేసి రంగనాయకులపేట రైల్వేగేటు సమీపంలోని బర్మాషెల్‌గుంటకు వచ్చారు. ఆర్థిక పరిస్థితులను బట్టి పూరిళ్లు, రేకుల ఇళ్లను నిర్మించుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం పనుల నుంచి వచ్చిన వారు భోజనం చేసి నిద్రపోయారు. మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో తూర్పువైపు ఉండే పూరిళ్లలో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతంలో దట్టంగా పొగ కమ్ముకుంది. ఇంతలో అటుగా వెళ్తున్న వారు పెద్దపెద్దగా కేకలు వేయడంతో నిద్రిస్తున్న వారు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. అప్పటికే తూర్పువైపున ఉన్న ఆరు ఇళ్లకు మంటలు వ్యాపించాయి. వాటిని ఆర్పేందుకు ప్రయత్నించారు. చూస్తుండగానే పడమర వైపునున్న ఇళ్లకూ మంటలు వ్యాపించాయి. దీంతో బాధితులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. ఇళ్లలో ఉన్న వృద్ధులను అతికష్టంపై బయటకు తీసుకొచ్చారు. జయమ్మ అనే వృద్ధురాలిని ఇంట్లో బయటకు తీసుకొచ్చే క్రమంలో ఆమెతోపాటు కాపాడిన చంద్ర అనే వ్యక్తి సైతం తీవ్రగాయాలయ్యాయి.

మంటల్లో చిక్కుకుని..

సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి వాకా శ్రీనివాసులరెడ్డి, సహాయ అధికారి వేణుగోపాల్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. పూరిళ్లు కావడం, లోపల గ్యాస్ లీక్ అవడంతో మంటలు ఉవ్వెత్తున్న ఎగసిపడడంతో రెండుగంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు ఆర్పే క్రమంలో ఓ ఇంట్లో దివ్యాంగురాలైన నాగలక్ష్మి (40) మృతదేహాన్ని అగ్ని మాపక సిబ్బంది గుర్తించారు. మంటలు చెలరేగిన సమయంలో నాగలక్ష్మి ఇంటి బయటే ఉందని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని స్థానికులు చెప్పారు. మంటలను ఆర్పే క్రమంలో ఆమె గురించి పట్టించుకోలేదు. ఇంట్లోకి వెళ్లిన నాగలక్ష్మి బయటకు రాలేక సజీవ దహనమైంది. ఆమె మృతదేహాన్ని చూసి అన్న శంకర్, కుటుంబసభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

భారీగా ఆస్తి నష్టం

ప్రమాదంలో 12 ఇళ్లు పూర్తిగా, మరో మూడిళ్లకుపైగా పాక్షికంగా దెబ్బతిన్నాయి. రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. తేజ అనే వ్యక్తి స్కూటీ దగ్ధమైంది. 12 ఇళ్లకు చెందిన వారు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో వీధినపడ్డారు. ఇక తమ పరిస్థితి ఏంటని కన్నీటి పర్యంతమయ్యారు.

కేసు నమోదు

మృతురాలు నాగలక్ష్మి అన్న శంకర్ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు అగ్నిప్రమాద ఘటనపై కేసు నమోదు చేశారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ప్రమాదానికి గురైన ఇళ్ల సమీపంలో చెత్తను తగులబెట్టగా నిప్పురవ్వలు ఎగసిపడి ప్రమాదం జరిగిందని కొందరు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని మరికొందరు స్థానికులు, బాధితులు పేర్కొంటున్నారు. దీంతో పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారణం ఏదైనా రెక్కాడితే గాని డొక్కాడని ఆ నిరుపేదల కుటుంబాల్లో అగ్నిప్రమాదం తీరని ఆవేదనను మిగిల్చింది. ఈ ఘటనపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరా తీశారు. సర్వస్వం కోల్పోయిన 13 మంది కుటుంబాలకు తక్షణ సాయం కింద తన సొంత నిధులు రూ.15 వేల చొప్పున టీడీపీ నేత అజీజ్ చేతుల మీదుగా అందజేశారు. మృతురాలి కుటుంబానికి అదనంగా రూ.30 వేలను ఇచ్చారు. నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ బాబీ పరిశీలించారు.



బియ్యం బూడిదపాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీ

బాధితులను ఆదుకుంటాం



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించిందని, విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సహాయ చర్యలను చేపట్టిందన్నారు. దివ్యాంగురాలు మృతిచెందడం బాధాకరమన్నారు. బాధితులకు నిత్యావసర సరుకులు తక్షణ సాయంగా అందజేస్తామన్నారు.

స్నేహితులతో సరదాగా బీచ్‌కెళ్లి..

- సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

ఇందుకూరుపేట: సముద్రంలో ఓ విద్యార్థి మునిగిపోయి మృతి చెందిన ఘటన మండలంలోని మైపాడులో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వెంకటాచలం మండలంలోని గుడ్లూరువారిపాళేనికి చెందిన ఎం.గోపీకృష్ణ గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. అతను తన స్నేహితుడు కార్తీక్‌తో కలిసి మైపాడు బీచ్‌కు మోటార్‌బైక్‌పై వచ్చాడు. అంతకుముందే గోపీకృష్ణ స్నేహితులు కొందరు బీచ్‌కు వచ్చారు. అలల వల్ల గోపీకృష్ణ, కార్తీక్ సముద్రపు నీటిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని గమనించిన తోటివారు కేకలు వేయడంతో స్థానికులు వారిని బయటకు లాగారు. ఇద్దరినీ చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు గోపీకృష్ణ మృతిచెందినట్లు నిర్ధారించారు. కార్తీక్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని తెలిసింది. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.



గోపీకృష్ణ మృతదేహం

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

కందుకూరు: మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ (టీబీ) డాక్టర్ టి.రమేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఉన్న టీబీ కేసులను, ల్యాబ్ రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. అనంతరం కొండముడుసుపాళెం, మోపాడు సచివాలయాల పరిధిలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియ గురించి ఆరాతీశారు. అర్హులందరికీ వ్యాక్సిన్ వేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవధ, మాచవరం వైద్యాధికారి డాక్టర్ జుబేరియాభాను, ఎంపీహెచ్‌ఈఓ షేక్ ఆరిఫుల్లా, ల్యాబ్ సూపర్‌వైజర్ శివాజీ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు, ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి నగలు చోరీ

కలువాయి: గుర్తుతెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి నగలు చోరీ చేసిన ఘటన మండలంలోని కుల్లూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెంచలమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. బుధవారం అర్ధరాత్రి దాటాక ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లొచ్చి పడుకున్న సమయంలో ఇంట్లోకి ఇద్దరు వ్యక్తులు చొరబడ్డారు. పెంచలమ్మ కళ్లలో కారం కొట్టి ముఖంపై ముసుగువేసి గొంతు నులిమి చంపేస్తామని బెదిరించారు. అనంతరం ఆమె కాళ్లు, చేతులు కట్టేసి మెడలోని మూడున్నర సవర్ల సరుడు లాక్కొని, చేతికి ఉన్న గాజులు తీసే ప్రయత్నం చేశారు. ఈలోగా పక్కంటి వారు వస్తున్నట్లు గుర్తించిన దొంగలు గాజులు వదిలేసి సరుడు తీసుకొని పరాయ్యారు. సమాచారం అందుకున్న కలువాయి పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

కండలేరులో 6.410 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 150
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 264
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 294
లేయర్ చికెన్	: 204



పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30